క్లుప్తంగా

మునగపాక తహసీల్దార్ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు చేపట్టిన ఉమా మహేశ్వరరావును సత్కరిస్తున్న సిబ్బంది

మునగపాక: మునగపాక మండల తహసీల్దార్‌గా ఎస్.ఆది ఉమామహేశ్వరరావు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. రెవెన్యూ అధికారుల బదిలీల్లో భాగంగా రావికమతం మండల తహసీల్దార్‌గా పనిచేసిన ఆయనను మునగపాకకు బదిలీ చేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు తన చాంబర్‌లో ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఉమా మహేశ్వరరావుకు డీటీ శేషుబాబు, వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది, తదితరులు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

కోటవురట్ల తహసీల్దారుగా తిరుమలబాబు



కోటవురట్ల: తహసీల్దారుగా ఎల్.తిరుమలబాబు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన తహసీల్దారు జానకమ్మకు విశాఖ జిల్లా ఆర్డీవో కార్యాలయంలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా బదిలీ అయ్యింది. చోడవరంలో తహసీల్దారుగా పని చేస్తున్న ఎల్.తిరుమలబాబు బదిలీపై ఇక్కడికి వచ్చారు.వీ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు సకాలంలో ధ్రువ పత్రాలు అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. భూసమస్యలు పరిష్కరించి రైతులకు అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. డిప్యూటీ తహసీల్దారుగా పి.రమేష్ బాధ్యతలు చేపట్టారు. ఈయన చీడికాడలో పనిచేస్తూ ఇక్కడికి బదిలీపై వచ్చారు.

సబ్ రిజిస్ట్రార్‌గా రవికుమార్



యలమంచిలి రూరల్: యలమంచిలి సబ్ రిజిస్ట్రార్‌గా కె.రవికుమార్ శుక్రవారం బాధ్యతలు చేపట్టా రు. స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖలో ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో భాగంగా శ్రీకాకుళం జిల్లా టెక్కలి నుంచి యలమంచిలికి బదిలీపై ఆయన వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన ఎం.అప్పారావుకు లంకెలపాలెం కార్యాలయానికి బదిలీ అయింది. విధుల్లో చేరిన రవికుమార్‌కు కార్యాలయ సిబ్బంది, డాక్యుమెంట్ రైటర్లు శుభాకాంక్షలు తెలిపారు. అందరి సహకారంతో ప్రజలకు మెరుగైన సేవలందించడానికి కృషి చేస్తానని రవికుమార్ తెలిపారు.

యలమంచిలి ఎంపీడీవోగా కొండలరావు



కొండలరావుకు శుభాకాంక్షలు చెబుతున్న ఏవో ప్రసాద్, ఈవోపీఆర్డీ శ్రీనివాస్

యలమంచిలి రూరల్: యలమంచిలి ఎంపీడీవోగా కె.సత్య కొండలరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. రాంబిల్లి ఎంపీడీవోగా పని చేస్తున్న కొండలరావును ఇటీవల సాధారణ బదిలీల్లో భాగంగా యలమంచిలికి బదిలీ చేస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ ఎంపీడీవోగా పని చేసిన కె.అప్పలనాయుడుకు శ్రీకాకుళం జిల్లాకు బదిలీ అయింది. విధుల్లో చేరిన కొండలరావుకు కార్యాలయ ఏవో ప్రసాద్, ఈవోపీఆర్డీ శ్రీనివాస్, మండల ఇంజినీర్ సోమశేఖర్, పంచాయతీ కార్యదర్శులు, నరేగా సిబ్బంది, సచివాలయ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. ఎంపీపీ బోదెపు గోవింద్‌ను ఆయన మర్యాద పూర్వకంగా కలిశారు. మండలాభివృద్ధికి సమన్వయంతో పని చేద్దామన్నారు.

మన ఇల్లు-మన గౌరవం నేడు

కోటవురట్ల: మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల పరిధిలో శనివారం మన ఇల్లు-మన గౌరవం కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో కాశీవిశ్వనాథరావు ఓ ప్రకటనలో తెలిపారు. మండల స్థాయి అధికారులు, కార్యదర్శులు హౌసింగ్ లే అవుట్లలో పర్యటించి ఈ కార్యక్రమం ద్వారా లబ్ధిదారుల సమస్యలు తెలుసుకుంటారని పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందని, లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.



నక్కపల్లి చేనేత కాలనీలోకి చేరిన వరదనీరు



అచ్యుతాపురంలో కురుస్తున్న వర్షం



కోటవురట్ల మెయిన్‌రోడ్డులో నిలిచిపోయిన వర్షం నీరు

ముంచెత్తిన వాన

- లోతట్టు ప్రాంతాలు జలమయం
- చిత్తడిగా ప్రధాన రహదారులు
- ముంపులో పంట పొలాలు



నీటమునిగిన ఉద్యానవన, కూరగాయల పంటలు



తిమ్మాపురం శివారులో రోడ్డుపై నిలిచిన నీరు



ఉపమాక జగనన్న కాలనీల్లోకి చేరిన వర్షపునీరు

నక్కపల్లి: పాయకరావుపేట నియోజకవర్గంలో శుక్రవారం వర్షం కుండపోతగా పడింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎడతెరిపి లేకుండా ఏకధాటిగా వర్షం పడడంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. గురువారం రాత్రి నుంచే వర్షం పడడంతో ఎక్కడికక్కడ వర్షపు నీరు నిలిచిపోయింది. జిల్లాలోనే అత్యధికంగా నక్కపల్లి మండలంలో 84 శాతం వర్షపాతం నమోదయినట్లు అధికారులు తెలిపారు. భారీ వర్షం కారణంగా జనజీవనం స్తంభించింది. పలు గ్రామాల ప్రధాన రహదారులు జలమయమయ్యాయి. నక్కపల్లి నుంచి ఉపమాక మీదుగా చందనాడ, బుచ్చిరాజుపేట, రాజయ్య పేట గ్రామాలకు వెళ్లే ప్రధాన రోడ్డుపై ఉపమాక వద్ద వర్షపు నీరు నిలిచిపోయి చెరువును తలపిస్తోంది. మోకాలి లోతున భారీగా వరదనీరు చేరడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఈ గ్రామాలకు వెళ్లే ఆటోలు నిలిచిపోయాయి. ద్విచక్ర వాహనదారులు చాలా ఇబ్బంది పడ్డారు. ఉపమాక ఆలయ ప్రాంగణం ఎదురుగా ఉన్న మెయిన్‌రోడ్డు, షాపింగ్ కాంప్లెక్స్ ముందు నీరు నిలిచిపోయింది. నక్కపల్లిలో ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణతో పాటు చేనేత కాలనీలో వర్షపునీరు వీధుల్లోకి భారీగా చేరింది. నేతన్నల మగ్గాల్లోకి వర్షపు నీరు చేరిపోయింది. ఉపమాక గ్రామస్తుల కోసం ఏర్పాటు చేసిన జగనన్న కాలనీ వరద నీటిలో మునిగిపోయింది. జాతీయ రహదారి నుంచి చినరామభద్రపురం వెళ్లే రోడ్డులో కాలువలు నిర్మించకపోవడంతో ఎక్కడికక్కడ వర్షపు నీరు నిలిచిపోయింది. ఉద్దండపురం, వేంపాడు, కాగిత గ్రామాల్లో కూడా ఇదే పరిస్థితి నెలకొంది. పలు గ్రామాల్లో ఉద్యాన వన పంటలు, కూరగాయలు, వరి పంటలు ముంపునకు గురయ్యాయి.

అచ్యుతాపురం(మునగపాక): అచ్యుతాపురం మండల వ్యాప్తంగా భారీ వర్షం కురిసింది. మండల పరిషత్ కార్యాలయం ఎదురుగా వర్షం నీరు నిలిచిపోయింది. దీంతో రాకపోకలు సాగించే ఉద్యోగులతో పాటు పలు పనులపై వచ్చే వారు ఇబ్బందులు పడ్డారు. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి.

కోటవురట్ల: కుండపోత వర్షంతో జనజీవనం స్తంభించింది. శుక్రవారం తెల్లవారు జాము నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షంతో రహదారులు, లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఎంపీడీవో కార్యాలయం ఎదుట భారీగా వర్షపు నీరు నిలిచిపోయింది. జల్లూరు వంతెనపై గోతుల్లో వర్షపు నీరు నిలిచిపోవడంతో వాహనదారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బంది పడ్డారు. జల్లూరు శివారున ఉన్న దుగ్గాడ కాలువలోకి జలకళ వచ్చింది. పంట పొలాల్లోకి భారీగా వర్షపు నీరు చేరుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఎస్.రాయవరం: మండలంలో కురిసిన వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పెదగుమ్ములూరు, తిమ్మాపురం, కొరుప్రోలు, సైతారుపేట, సర్వసిద్ధి, పి.ధర్మవరం, గోకులపాడు తదితర గ్రామాల్లో ఆర్‌అండ్‌బీ రోడ్ల పక్కన వర్షపు నీరు కాలువలే ప్రవహించింది. తిమ్మాపురం రోడ్డుపై నీరు నిలిచిపోయింది. సాయిమెరైన్ గెడ్డ నిండుగా ప్రవహించడంతో వరి పొలాలు ముంపునకు గురవుతున్నాయని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సైతారుపేట జంక్షన్‌లో రోడ్డు చెరువులా మారిపోయింది. సర్వసిద్ధి పీహెచ్‌సీ సమీపంలోనూ వర్షపు నీరు నిలిచిపోయింది.

4 సెంటీమీటర్ల వర్షం

యలమంచిలి రూరల్: బంగాళాఖాతంలో అల్పపాడన ప్రభావంతో శుక్రవారం యలమంచిలి పట్టణంలో 4 సెంటీమీటర్ల వర్షం కురిసింది. ఉదయం నుంచి సాయంత్రం వరకూ వర్షం పడడంతో జనజీవనానికి ఆటంకం ఏర్పడింది. పలుచోట్ల వీధుల్లో అంతర్గత రహదారులపై వర్షపు నీరు నిలిచిపోయింది. ఈ వర్షం వరి పంటకు బాగా మేలు చేస్తుందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రామప్పారావు కుటుంబ సభ్యులకు పరామర్శ



రామప్పారావు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా మాజీ అధ్యక్షుడు ప్రసాద్

అచ్యుతాపురం(మునగపాక): అచ్యుతాపురం మండలం హరిపాలెం వైఎస్సార్‌సీపీ నేత శరగడం రామప్పారావు మృతి బాధాకరమని ఆ పార్టీ జిల్లా మాజీ అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ అన్నారు. హరిపాలెం వైఎస్సార్‌సీపీ నేత శరగడం అప్పలనాయుడు తండ్రి రామప్పారావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలిసిందే. శుక్రవారం రామప్పారావు కుటుంబ సభ్యులను బొడ్డేడ పరామర్శించి, ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో హరిపాలెం సర్పంచ్ మారిశెట్టి సూర్యనారాయణ, పార్టీ నాయకులు పిన్నమరాజు రవీంద్ర, కాండ్రేగుల జగన్, వ్యాపారవేత్త ఆడారి కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

చదువుతో పాటు అన్ని రంగాల్లోనూ రాణించాలి

మునగపాక: విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లోనూ రాణించాలని శ్రీ వెంకటేశ్వర గీతా ప్రచార సమితి కన్వీనర్ శరగడం పరదేశినాయుడు కోరారు. వినాయక చవితిని పురస్కరించుకుని ప్రచార సమితి ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన వినాయక జీవిత చరిత్రపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలకు గురువారం రాత్రి ఆయన బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా భక్తి భావాలను అలవరుచుకోవాలన్నారు. పిల్లలు కూడా తల్లిదండ్రులపై గౌరవం కలిగి ఉండాలన్నారు. మొదటి బహుమతిని డైట్ ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన ఆర్.గాయత్రి, ద్వితీయ బహుమతిని హిమశేఖర్ కళాశాలకు చెందిన హిందూజా, ప్రణతి స్కూల్‌కు చెందిన ప్రవీణ్ తృతీయ బహుమతిని అందుకున్నారు.

చినదొడ్డిగల్లులో సామూహిక సీమంతాలు



చినదొడ్డిగల్లులో సామూహిక సీమంతం కార్యక్రమం నిర్వహిస్తున్న ఐసీడీఎస్ అధికారులు

నక్కపల్లి: చినదొడ్డిగల్లు గ్రామంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషకాహార మాసోత్సవాలు నిర్వహించారు. శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సీతారామరాజు, సీడీపీవో శ్రీవిద్య, సర్పంచ్ బొల్లం చంద్రరావు, వైస్ ఎంపీపీ వెలగా ఈశ్వరరావు, కొప్పిశెట్టి వెంకటేష్ తదితరులు హాజరై 25 మంది గర్భిణులకు సామూహిక సీమంతాలు చేశారు. నలుగురు చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పోషకాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఐసీడీఎస్ సిబ్బంది మాట్లాడుతూ రక్తహీనత గురించి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. బాల సంజీవిని ప్రతి ఒక్కరూ తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు తోట సత్తిబాబు, అంగన్‌వాడీ కార్యకర్తలు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

సచివాలయ భవనానికి మళ్లీ ప్రారంభోత్సవం



సచివాలయ భవనానికి రిబ్బన్ కటింగ్ చేస్తున్న మాజీ సర్పంచ్ వెంకటరాజు

ఎస్.రాయవరం: గుడివాడ గ్రామంలో గతంలో ప్రారంభించిన సచివాలయ భవనానికి మాజీ సర్పంచ్ నల్లపరాజు వెంకటరాజు శుక్రవారం రిబ్బన్ కట్ చేసి మళ్లీ ప్రారంభోత్సవం చేయడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. గత ప్రభుత్వంలో అప్పటి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కోటికి పైగా నిధులు కేటాయించి సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వెల్‌నెస్ సెంటర్ నిర్మాణాలు చేపట్టిన సంగతి తెలిసిందే. వైఎస్సార్‌సీపీ నాయకుడు శ్రీపతిరాజు స్థలం కేటాయించడంతో ఈ మూడు భవనాలను ఒకే చోట నిర్మించారు. పూర్తయిన భవనాలను అప్పటి ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అట్టహాసంగా ప్రారంభించి అందుబాటులోకి తీసుకొచ్చారు. అయితే ఇటీవల కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఆ పార్టీల నాయకులు అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారు. శుక్రవారం ఓ భవనానికి మాజీ సర్పంచ్ వెంకటరాజు రిబ్బన్ కట్టి కటింగ్ చేసి కొత్తగా ప్రారంభిస్తున్నట్టు హంగామా చేశారు. అది చూసిన స్థానికులు ముక్కున వేలేసుకున్నారు. ప్రారంభించిన భవనాలకు మళ్లీ ప్రారంభోత్సవం ఏమిటని ఆక్షేపిస్తున్నారు. అయితే ఈ ప్రారంభోత్సవానికి అధికారులు ఎవరూ హాజరు కాలేదు. ఈ విషయంపై పంచాయితీ కార్యదర్శి నాయుడిని వివరణ కోరగా.. భవనంలో ప్రారంభోత్సవం ఏమి లేదని , ఇటీవల సర్పంచ్ దూళి శ్రీనుబాబు పంచాయతీ కార్యాలయానికి అవసరమైన సామాన్లు కొన్నారని, వాటిని శుక్రవారం భవనంలో సర్ది పెట్టామన్నారు.

ఎన్‌ఆర్‌ఎస్‌టీసీ సందర్శన



విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న ఏఎల్ఎస్ కో ఆర్డినేటర్ గిరిధర్

కోటవురట్ల: గొట్టివాడ శివారు అణుకు గిరిజన గ్రామంలోని నాన్ రెసిడెన్షియల్ స్పెషల్ ట్రైనింగ్ సెంటర్(ఎన్‌ఆర్‌ఎస్‌టీసీ)ను సర్వశిక్షా అభియాన్ ఏఎల్ఎస్ కో ఆర్డినేటర్ ఎల్.గిరిధర్ శుక్రవారం సందర్శించారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరీక్షించి సంతృప్తి వ్యక్తం చేశారు. గొట్టివాడ ఎంపీపీఎస్ ఉపాధ్యాయుడు జి.హరీష్‌బాబు డెప్యుటేషన్‌పై కొండల్లో ఉన్న అణుకు గ్రామానికి వెళ్లి బోధన చేయడం పై అభినందించారు. నిబద్ధతతో పని చేస్తూ గిరిజన విద్యార్థులను ఉత్తమంగా తీర్చిదిద్దేందుకు కృషి చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సీఎంవో శకుంతల, ఎంఈవోలు రామారావు, శ్రీజోష్ పాల్గొన్నారు.

కలెక్టర్ ఆదేశాలకే దిక్కులేదా..?

- ఆర్‌అండ్‌బీ అధికారుల తీరుపై జనం ఆగ్రహం



బంగారుమెట్ట జంక్షన్‌లో పెద్ద గొయ్యి మీదుగా రాకపోకలు సాగిస్తున్న వాహనదారులు

బుచ్చెయ్యపేట : జిల్లా కలెక్టర్ ఆదేశాలంటే ఆర్‌అండ్‌బీ అధికారులకు లెక్కలేనట్లుంది. భీమునిపట్నం, నర్సీపట్నం(బీఎన్) రోడ్డులో బంగారుమెట్ట జంక్షన్ వద్ద రోడ్డు మధ్య పెద్ద గొయ్యి పడింది. ఈ నెలలో కురిసిన వర్షాలకు వడ్డాది పెద్దేరు, విజయరామరాజుపేట తాచేరు వంతెనలపై నుండి నీరు ప్రవహించింది. డైవర్షన్ రోడ్లు దెబ్బతినడంతో పరిశీలించడానికి 9వ తేదీన జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ మండలానికి వచ్చారు. బంగారుమెట్ట జంక్షన్‌లో రోడ్డు మధ్యలో ఉన్న పెద్ద గొయ్యిలో చేరిన వర్షం నీరును చూసి కలెక్టర్ కారు ఆపి గొయ్యిలో నీరు బైటకు పోయేలా చేసి గొయ్యిని పూడ్చాలని అధికారులను ఆదేశించారు. దీంతో ఆర్‌అండ్‌బీ, మండల, పంచాయితీ అధికారులు కాస్త హడావిడి చేసి తూతూ మంత్రంగా గోతిలో నీరు బైటకు పోయేలా చేసి కొద్దిగా గ్రావెల్ వేసి వదిలేశారు. నిత్యం వేలాది వాహనాలు తిరిగే రోడ్డు అవడంతో ఈ గొయ్యి మరింత పెరిగి వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. స్వయాన జిల్లా కలెక్టర్ గొయ్యిని పూడ్చాలని ఆదేశాలిచ్చినా అధికారులు తూతూ మంత్రం పనులు చేయడంపై స్థానికులు మండి పడుతున్నారు. నర్సీపట్నం, అనకాపల్లి, చోడవరం వైపు వెళ్లే ముఖ్య కూడలి బంగారుమెట్ట జంక్షన్‌లో గొయ్యిని పూడ్చి ప్రమాదాలు తప్పించాలని పలువురు కోరుతున్నారు.

యలమంచిలి మండల సర్వసభ్య సమావేశం నేడు

యలమంచిలి రూరల్: యలమంచిలి మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం శనివారం ఉదయం 10.30 గంటలకు జరగనుందని ఎంపీడీవో కె.సత్యకొండలరావు తెలిపారు. ఎంపీపీ బోదెపు గోవింద్ అధ్యక్షతన జరగనున్న ఈ సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని ఆయన కోరారు. ఇప్పటికే సమావేశం అజెండాను సభ్యులకు అందజేశామన్నారు.

ఘనంగా దుర్గాదేవి రాట మహోత్సవం



అరబుపాలెంలో దుర్గాదేవి రాట మహోత్సవంలో భక్తులు

మునగపాక: మండలంలోని అరబుపాలెంలో శుక్రవారం దుర్గాదేవి రాట మహోత్సవం ఘనంగా జరిగింది. శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గౌరీ యూత్ ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో రాట వేశారు. ముందుగా వేప చెట్టుకు మహిళలు కుంకుమ, పసుపు అద్ది పూజలు చేశారు. కొయిలాడ మోహన్, గంగాధర్, కాండ్రేగుల మధు, కొయిలాడ చైతన్య, ఆడారి గణేష్, ఆడారి ప్రసాద్, పెంటకోట శివకృష్ణ, పారునాయుడు, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఫార్మా ప్రమాదాల బాధ్యులను అరెస్ట్ చేయాలి



విలేకరులతో మాట్లాడుతున్న సీఐటీయూ నేతలు రాము, సోమునాయుడు

అచ్యుతాపురం(మునగపాక): అచ్యుతాపురం ఫార్మాలో జరిగిన ప్రమాదాలకు కారణమైన యాజమాన్యాలను అరెస్ట్ చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రొంగలి రాము డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత నెలలో ఎసైన్షియా కంపెనీలో జరిగిన ప్రమాదానికి కారకులైన వారిపై ఇంతవరకు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం విచారకరమన్నారు. ప్రభుత్వం హైలెవెల్ కమిటీ ఏర్పాటు చేసిందన్నారు. లోపాలను గుర్తించిందన్నారు. కంపెనీల్లో అగ్ని ప్రమాదాలు జరిగితే నియంత్రించే వ్యవస్థ లేదన్నారు. ప్రమాదాలు జరిగినప్పుడు కమిటీలు పర్యటించడం సాధారణమన్నారు. తరువాత ఒరిగిందేమీ ఉండడం లేదన్నారు. ప్రతి ఆరు నెలలకు ఆడిట్ నిర్వహించాల్సి ఉన్నా.. అటువంటి చర్యలు లేవన్నారు. పొల్యూషన్ అధికారులు నిరంతరం తనిఖీలు నిర్వహించి ప్రమాదాలకు కారణమైన యాజమాన్యాలపై కేసులు నమోదు చేసి శిక్షించాలన్నారు. ఈ సమావేశంలో మండల కన్వీనర్ సోమునాయుడు పాల్గొన్నారు.

అమెరికా స్థాయిలో అచ్యుతాపురం అభివృద్ధి

సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే విజయకుమార్



దుప్పితూరులో మంచినీటి పథకం మెట్ల సమస్యను ఎమ్మెల్యేకు విన్నవిస్తున్న సర్పంచ్ శంకరరావు

అచ్యుతాపురం(మునగపాక): అచ్యుతాపురం మండలాన్ని అమెరికా స్థాయిలో అభివృద్ధి చేస్తానని, ఇందుకు రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ కోరారు. అచ్యుతాపురం మండల పరిషత్ హాలులో శుక్రవారం సర్వసభ్య సమావేశం ఎంపీపీ కోన సంధ్య అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా విజయకుమార్ మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్యం, డ్రైనేజీ సమస్యలపై సర్పంచ్‌లు, కార్యదర్శులు దృష్టి సారించాలన్నారు. అచ్యుతాపురం కూడలి విస్తరణకు కొంత మంది సహకరించడం లేదని, అయినా అన్ని అవాంతరాలైనా అధిగమించి విస్తరణ చేపడతామన్నారు. జలజీవన్ మిషన్ ద్వారా అన్ని గ్రామాలకు తాగునీటి సదుపాయం కల్పిస్తామన్నారు. దుప్పితూరు గ్రామంలోని రక్షిత మంచినీటి పథకం మెట్లు శిథిలావస్థకు చేరాయని, ఈ విషయమై అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోలేదని ఆ గ్రామ సర్పంచ్ దేశంశెట్టి శంకరరావు ఆరోపించారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. తమ గ్రామంలో పలు పనులకు తీర్మానాలు చేశామని, తక్షణం పనులు ప్రారంభించాలని మల్లవరం సర్పంచ్ పిన్నమరాజు వాసు కోరారు. జెడ్పీటీసీ సభ్యుడు లాలం రాంబాబు, జిల్లా పరిషత్ కో-ఆప్షన్ సభ్యుడు నర్మాల కుమార్, ఎంపీడీవో కె.ప్రభాకరరావు, డీటీ నీరజ, పలువురు ప్రజా ప్రతినిధులు, పలు శాఖల అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

ఉత్సాహంగా నియోజకవర్గ స్థాయి ఆటల పోటీలు



ఆటల పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

పాయకరావుపేట: మండలంలోని ఎస్.నర్సాపురం జెడ్పీహెచ్ స్కూల్‌లో నియోజకవర్గ స్థాయి ఆటల పోటీలు ఉత్సాహంగా సాగాయి. ఈ పోటీలను కూటమి నాయకులు తోట నగేష్, పెదిరెడ్డి చిట్టిబాబు, గొర్రెల రాజుబాబు, గూటూరు శ్రీను, వైస్ ఎంపీపీ పల్లేల స్వామి, సర్పంచ్ మంచాల అనిత ప్రారంభించారు. శుక్ర, శని వారాల్లో జరిగే ఈ పోటీల్లో శుక్రవారం నియోజకవర్గంలోని 4 మండలాల నుంచి ఆయా పాఠశాలల విద్యార్థులు హాజరయ్యారు. కబడ్డీ, వాలీబాల్, బ్యాడ్మింటన్, ఖోఖో, చెస్, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహిస్తున్నారు. ఆటల నిర్వహణకు అధ్యక్షులుగా పాఠశాల హెచ్ఎం ఎం.ఝాన్సీ, ఎస్ఎంసీ చైర్మన్ మాసా ఈశ్వరరావు, వైస్ చైర్మన్ బగ్గు అమరావతి, నియోజకవర్గ కో ఆర్డినేటర్‌గా వ్యాయామ ఉపాధ్యాయుడు టి.రవికుమార్ వ్యవహరించారు.

స్కూల్ గేమ్స్‌లో పురుషోత్తపురం విద్యార్థుల ప్రతిభ



వివిధ పోటీల్లో ప్రతిభ చూపిన పురుషోత్తపురం హైస్కూల్ విద్యార్థులు

యలమంచిలి రూరల్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఇటీవల యలమంచిలిలో జరిగిన మండల స్థాయి ఆటల పోటీల్లో పురుషోత్తపురం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. అండర్-17 బాలికల విభాగంలో కబడ్డీ, వాలీబాల్ పోటీల్లో ప్రథమ స్థానం, అండర్-14 బాలుర విభాగంలో బ్యాడ్మింటన్‌లో ప్రథమ స్థానం, అండర్-14 యోగా బాలుర విభాగంలో ద్వితీయ స్థానం, అథ్లెటిక్స్‌కు సంబంధించి 100 మీటర్లు, 200 మీటర్లు, 400 మీటర్ల హైజంప్, లాంగ్ జంప్, షాట్ పుట్, డిస్కస్‌త్రో, ట్రిపుల్ జంప్, జావెలిన్ త్రో పోటీల్లో పలువురు విద్యార్థులు మొదటి, రెండు స్థానాల్లో నిలిచారని ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు మల్లిపాటి సత్యనారాయణ తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థులను శుక్రవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో హెచ్ఎం, ఉపాధ్యాయులు అభినందించారు. విజేతలు త్వరలో జరగబోయే స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నియోజకవర్గ స్థాయి పోటీల్లో పాల్గొంటారని వ్యాయామ ఉపాధ్యాయుడు సూర్యప్రకాశరావు తెలిపారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



పోటీలను పర్యవేక్షిస్తున్న విద్యా శాఖాధికారులు

కోటవురట్ల: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం స్వర్ణాంధ్ర 2047 కార్యక్రమం నిర్వహించారు. ఇన్‌చార్జ్ హెచ్ఎం నారాయణరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యాస రచన పోటీల్లో జల్లూరు, కె.వెంకటాపురం జెడ్పీ హైస్కూళ్లు, కోటవురట్ల జెడ్పీ బాలికోన్నత పాఠశాల, కేజీబీవీ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ప్రతిభ కనబరిచారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు రామారావు, శ్రీజోష్, హెచ్ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మునగపాక: స్థానిక ఎంఆర్‌సీ భవనంలో శుక్రవారం నిర్వహించిన వ్యాస రచన పోటీలకు విశేష స్పందన లభించింది. ఎంఈవోలు వేణుగోపాలరావు, శివనాయుడు పోటీలను పర్యవేక్షించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. సీఆర్ఎంటీలు కె.లక్ష్మీనారాయణ, అచ్యుతకృష్ణ, నూకేష్, రామలక్ష్మి, వీరప్పారావు, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.